క్లుప్తంగా

శివాలయం కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

కల్లూరు: కల్లూరులోని శ్రీ కాశ్మీర మహాదేవక్షేత్రం (కల్లూరు అప్పయ్య) శివాలయం నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం దేవాదాయశాఖ ఖమ్మం డివిజన్ ఇన్‌స్పెక్టర్ రెంటాల సమత, ఆలయ మేనేజర్ ఎస్‌వీడీ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా మాడిశెట్టి వెంకటేష్, సభ్యులుగా పెద్దబోయిన శివ, యనుముల రాము, తిరుమలగిరి లక్ష్మయ్య, మూకర నాగమణి, అబ్బూరి యుగంధర్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు పసుమర్తి చందర్‌రావు, జాబిశెట్టి శ్రీనివాసరావు, ఏనుగు సత్యంబాబు, ధరావత్ మోహన్, పెద్దబోయిన నారాయణరావు, మాడిశెట్టి శ్రీనివాసరావు, దారా రంగా, బుర్రి వీరయ్య, లక్ష్మణరావు, బొప్పన శ్రీనాథ్, తోట సుబ్బారావు, ఎస్‌కే ఉస్మాన్, పెద్దబోయిన నరసింహారావు, కిష్టంశెట్టి ఏడుకొండలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మధ్యాహ్న భోజనం పునఃప్రారంభం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.నర్సింహారావు, దారా కృష్ణారావు, ఎం.ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, వీరన్న, రామచంద్రరావు, మధు, పీర్ సాహెబ్, చెన్నారావు, శ్రీనివాస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా శ్రీకాంత్



నియామక పత్రం అందుకుంటున్న శ్రీకాంత్

ముదిగొండ: బీజేపీ మండలాధ్యక్షుడిగా ముదిగొండకు చెందిన అల్లిక శ్రీకాంత్‌ను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్ల సత్యనారాయణ సోమవారం నియామకపత్రం ఖమ్మంలో అందజేశారు. మండలంలోని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షుడు యరబోలు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన

ముదిగొండ: మండల పరిధిలోని వల్లాపురంలో మహాశివరాత్రి పురుస్కరించుకుని మల్లిఖార్జునస్వామి దేవాలయం వద్ద జాతర జరగనున్న నేపథ్యంలో జాతర ఏర్పాట్లను ఎస్సై నరేష్ సోమవారం పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తుల వాహనాలు, పార్కింగ్ చేసే స్థలాన్ని భక్తుల క్యూలైన్లు, మంచి నీటి వసతిని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఈఓ నారాయణచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నివాళి..



నివాళులర్పిస్తున్న నాయకులు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లకు చెందిన సీపీఐ నాయకుడు, మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య వర్ధంతి సందర్భంగా పలువురు నాయకులు ఆయన స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో నాయకులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్, గడల సీతారామయ్య, దొండపాటి రమేష్, విష్ణుమూర్తి, భాస్కరరావు, వెంకటేశ్వరరావు ఉన్నారు.

చేతిపంపు ఏర్పాటు

కల్లూరు: మండల పరిధిలోని చంద్రుపట్ల పంచాయతీలో మాజీ వార్డు సభ్యులు ఇనుపనూరి జమలయ్య, సెంటర్ ఫర్ డవలప్‌మెంట్ యాక్షన్ కార్యదర్శి రెవ. పి.ఎనోస్ కుమార్ ఆధ్వర్యంలో వెల్స్ ఫర్ లైఫ్ అధ్యక్షులు మైఖల్ వైజర్ సహకారంతో ఉచిత చేతిపంపు ఏర్పాటు చేశారు. ఈ మేరకు సోమవారం మైఖెల్ వేజర్, సీడీఏ కార్యదర్శి పి.ఎనోష్‌కుమార్‌లు చేతిపంపును ప్రారంభించారు. మాజీ సర్పంచ్ గొల్లమందల ప్రసాద్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, కాటేపల్లి రజనీకాంత్, జక్కంపూడి కిషోర్, వల్లభనేని రవి, వల్లపునేని శ్రీను, ఇనుపనూరి ముత్తయ్య, వీరభద్రం, వెంకటేశ్వర్లు, బాబూరావు, దొడ్డపునేని రవి, కొమ్మినేని రాము తదితరులు పాల్గొన్నారు.

పంట గొంతెండుతోంది..

సాగునీరు లేక ఎండిపోతున్న పంటలు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- విడుదల కాని సాగర్‌జలాలు
- పూడికతీతకూ రైతుల అవస్థలు



బోనకల్‌లో ఎండిపోతున్న మొక్కజొన్న

బోనకల్: ఈ ఏడాది రబీ పంటగా రైతులు సాగుచేసిన మొక్కజొన్న నీరందక ఎండిపోతుంది. మండల వ్యాప్తంగా బోర్లు, బావుల కింద రైతులు 7వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. నాగార్జున్ సాగర్‌లో నీరు లేకపోవడంతో సాగర్ జలాలను విడుదల చేయలేదు. సాగర్ ఆయకట్టు కింద ప్రతి ఏటా 16 నుంచి 18 వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేసేవారు. ప్రభుత్వం నీటి విడుదల చేయకపోవడంతో కేవలం నీటి వసతి ఉన్న భూముల్లో మాత్రమే రైతులు పంటలను సాగుచేశారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు..

ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, బావులలో నీరు లేకుండా పోయాయి. దీంతో రైతులు బావులలో పూడికతీత, కొత్త బావులు తీస్తుండడంతో వేలాది రూపాయిలు ఖర్చు అవుతున్నాయి. అయినప్పటికీ నీరు సరిపడకపోవడంతో కళ్లముందే పంట ఎండిపోయే పరిస్థితి దాపురించింది. వేలాది రూపాయిలు పెట్టుబడి పెట్టి పండించిన పంట కంకి గింజ పోసుకునే సమయంలో నీరు అందక ఎండిపోతుంది. అదేవిదంగా మిర్చి తోటలకు కూడా నీరందే పరిస్థితి లేకుండా పోయింది.

రైతుల ఆగచాట్లు..

పంటను రక్షించుకునేందుకు రైతుల అగచాట్లు అన్నీ.. ఇన్ని కావు. కిలో మీటర్ల దూరంలో ఉన్న చెరువుల నుంచి పైపులైన్లు వేసి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. చెరువులలో నీరు కూడా అడుగంటుతుండడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. కనీసం పశువులకు కూడా తాగేందుకు నీరు లేకుండా పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలలో కూడా పంటలకు నీటి అవసరం ఉండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కనీసం సాగర్‌జలాలు విడుదల చేసి చెరువులను నింపాలని అన్నదాతలు కోరుతున్నారు. తద్వారా భూగర్భజలాలు పెరిగి బోర్లు, బావులలో నీటి నిల్వలు పెరుగుతాయని రైతులు కోరుతున్నారు.

కళ్లముందే పంట ఎండిపోతుంది..



నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. ఎకరాకు రూ.40 వేల చొప్పున మొత్తం రూ1.60 వేలు ఖర్చయింది. బావిలో నీరు కనీసం గంట కూడా రావడం లేదు. ఎకరం పొలం తడవడానికి కనీసం వారం రోజులు పడుతుంది. దీంతో పంట కంకి దశలోనే ఎండిపోతుంది.

– బందం వెంకటేశ్వర్లు, రైతు

సాగర్ జలాలు విడుదల చేయాలి



చెరువులలో నీరు అడుగంటడంతో బోర్లలో నీరు రావడం లేదు. 2 ఎకరాల్లో మొక్కజొన్న, 2 ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. పంట చేతికందే సమయంలో నీరులేక ఎండిపోతున్నాయి. కనీసం ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు. సాగర్ జలాలతో చెరువులను నింపి పంటలను కాపాడాలి.

– బొద్దుపల్లి నరసింహారావు, రైతు

పదవికి వన్నె తెచ్చేలా పాలన..

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- అక్రమాలను సరిదిద్దుకోవాలి : ఎమ్మెల్యే రాగమయి
- రూ.38.27 కోట్లతో సత్తుపల్లి మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం



మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే మట్టా రాగమయిని సన్మానిస్తున్న మున్సిపల్ పాలకవర్గం

సత్తుపల్లిటౌన్: రాజకీయాల్లో శాశ్వత పదవులు ఎవరూ అనుభవించలేరని.. ఆ పదవి ఉన్నప్పుడే వన్నె తెచ్చేలా ప్రజలకు మేలు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి సత్తుపల్లి మున్సిపాల్టీ బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని అన్ని నియోజకవర్గాలతో పాటు సొంత నియోజకవర్గం ఎమ్మెల్యే రాగమయికి సంపూర్ణ సహకారం ఎల్లప్పుడు అందిస్తానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మంచి పాలన అందిస్తుందన్నారు. ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ... బడ్జెట్‌లో చాలా వృథా ఖర్చులు ఉన్నాయన్నారు. కొందరు ఉద్యోగులు కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేదని, మున్సిపాల్టీలో జరిగిన అక్రమాలు సరిదిద్దుకోవాలని సూచించారు. మున్సిపల్ నిధులకు తోడు నియోజకవర్గ అభివృద్ధి నిధులు కేటాయించి మున్సిపాల్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం సత్తుపల్లి మున్సిపాల్టీ 2024–25 సంవత్సరానికి రూ.38.27 కోట్ల అంచనా బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. ఖర్చు రూ.38.14 కోట్లుగా మిగులు 12.84 లక్షలుగా పేర్కొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిలను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, వైస్ చైర్మన్ తోట సుజలరాణి, కమిషనర్ ఎం.రవిబాబు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



బోరును పరిశీలిస్తున్న అధికారులు

వేంసూరు: వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ స్వరూపారాణి, ఈఈ పుష్పలత తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం కాలనీతో పాటు వేంసూరు గ్రామంలో పలు కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నియోజకవర్గ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రూ.13 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. వేంసూరు గ్రామానికి రూ. 3 లక్షలు, జయలక్ష్మీపురానికి రూ.2 లక్షలు, వైస్ బంజర్‌కు రూ.లక్ష, కల్లూరుగూడెంకు రూ.3 లక్షలు, అడసర్లపాడుకు రూ.2 లక్షల చొప్పున మంజూరైనట్టు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎంఏ.రాజు, ఏఈఈ జయలక్ష్మీ పాల్గొన్నారు.

‘ధరణి’ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



సర్వేను పరిశీలిస్తున్న పోతినేని సుదర్శన్‌రావు

బోనకల్: ధరణి పోర్టల్‌తో రైతులకు వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. మండల పరిధిలోని తూటికుంట్ల గ్రామంలో ధరణి సమస్యలపై రెవెన్యూ అధికారులు నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేను సోమవారం పోతినేని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలో ధరణి సమస్యలు 40 వరకు ఉన్నట్లు రైతులు, చెబుతుండగా రెవెన్యూ అధికారులు మాత్రం 19 సమస్యలే ఉన్నాయని చెప్పటం సరైంది కాదన్నారు. జిల్లా వ్యాప్తంగా ధరణి వలన పట్టా భూములు కూడా నిషేధిత జాబితాలోకి వెళ్లాయని దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ధరణి సమస్యలపై దరఖాస్తు చేసుకోని రైతులను కూడా గుర్తించి పూర్తి స్థాయిలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుళ్లూరు రమేష్, మాజీ సర్పంచ్ పాపినేని రామనర్సయ్య, నాయకులు పాపినేని అప్పారావు, రమేష్, వెంకటేశ్వరరావు, ముప్పల వీరయ్య పాల్గొన్నారు.

పరామర్శ

చింతకాని: మండల పరిధిలోని వందనం గ్రామంలో ఇటీవల మృతి చెందిన సీపీఎం నాయకులు షేక్ జానిమియా కుటుంబాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు పరామర్శించారు. పరామర్శించిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు వత్సవాయి జానకిరాములు, నన్నక కృష్ణమూర్తి, లింగాచారి, నారపోగు నారాయణ పాల్గొన్నారు.

ఒకేదఫాలో మూడు కొలువులు



బుర్రి రమేష్

మధిరరూరల్: మండల పరిధిలోని మునగాల గ్రామానికి చెందిన బుర్రి రమేష్ తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు హాజరై ఒకేసారి మూడు కొలువులు సాధించారు. కష్టపడి చదువుకుని ఒకేసారి జూనియర్ లెక్చరర్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) ఉద్యోగాలను సాధించారు.

కొలువు సాధించిన గృహిణి..



శృతి

మధిర: మధిర పట్టణానికి చెందిన శృతి గృహిణిగా ఇద్దరి పిల్లలను చదివించుకుంటూ మరోవైపు తన ప్రతిభతో ప్రభుత్వ కొలువు సాధించారు. పట్టణానికి చెందిన శృతి ఇటీవల జరిగిన పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటి టీజీటీ ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఆమె భర్త జ్ఞానేశ్వరచారి బోనకల్ మండలం కలకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఈ మేరకు ఎంఈఓ వై.ప్రభాకర్, ఉపాధ్యాయులు లంకెల మోహన్ రెడ్డి, బూసా కోటేశ్వరరావు, సిహెచ్ వి.రవికుమార్, ఎండి రఫీ అభినందించారు.



నియామక పత్రంతో ప్రసాద్

పెనుబల్లి : మండల పరిధిలోని కుప్పెనకుంట్ల గ్రామానికి చెందిన గోను ప్రసాద్ టీజీటీ ఉద్యోగం సాధించాడు. ఈ మేరకు గ్రామస్తులు ఆయన్ను అభినందించారు. కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిదంటూ ఉండదని ప్రసాద్ నిరూపించాడని పలువురు ప్రశంసించారు.

సన్మానం..



గౌషియాను సన్మానిస్తున్న సభ్యులు

తల్లాడ: ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన టీజీటీ ఫలితాల్లో ఇంగ్లీషు టీచర్‌గా ఎంపికైన షేక్ గౌషియాను స్థానిక ఎన్టీఆర్ కాలనీ యూత్ సభ్యులు సోమవారం సన్మానించారు. ఎన్టీఆర్ కాలనీ యూత్ సభ్యులు వేముల కోటేశ్వర్‌రావు, రాము, గోపి, ఎర్నం రామక్రిష్ణ, ఉదయ్, నవీన్, సాయి పాల్గొన్నారు.

క్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కమాండెంట్ వెంకటరాములు

సత్తుపల్లిరూరల్: స్థానిక మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో 23వ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు ప్రారంభించి మాట్లాడుతూ... శరీరం ఆరోగ్యంగా ఉంటే మనస్సు ఉల్లాసంగా ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ, కరస్పాండెంట్ సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, జాకీర్ హుస్సేన్, మారేశ్వరరావు పాల్గొన్నారు.

కస్టోడియన్ భూములకు పట్టాలు ఇప్పించండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని హనుమతాండ గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మాతండా, గనియాతండా, హనుమతాండలలో ఎన్నో సంవత్సరాలుగా సాగు చేస్తున్న కస్టోడియన్ భూములకు పట్టాలు ఇప్పించాలని కోరుతూ గిరిజనులు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయికు వినతిపత్రం అందించారు. సోమవారం ఎమ్మెల్యేను కలుసుకొని భూములకు సంబంధించి సమస్యను త్వరగా పరిష్కరించాలని, సాగు చేస్తున్న పేద గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంత వరకు పట్టాలు లేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నామని, అదే విధంగా గిరిజన తండాల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. కాంగ్రెస్ ఎస్టీ సెల్ కార్యదర్శి భూక్యా శివనాయక్, లంబాడి హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు దశరథ నాయక్, నాయకులు బాణోతు లాల్‌సింగ్, బాణోతు హేమ్లు, బంతి, రాములు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రత్యేక గుర్తింపు సాధించాలి

కొణిజర్ల: విద్యార్థులు తమకు తామే ప్రత్యేక గుర్తింపును సాధించుకున్నప్పుడే సమాజంలో పేరు ప్రఖ్యాతులు ఆర్జించగలుగుతారని రామకృష్ణ మఠం స్వామి బోధమయానంద తెలిపారు. సోమవారం తనికెళ్ల సమీపంలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో యువ సాధికారత అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. చదువుపై శ్రద్ధ వహించి భవిష్యత్‌లో రాణించాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి జాన్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి చిన్నయ్య, డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆయేషా తరుణమ్ వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కేంద్రం ప్రారంభం

పెనుబల్లి : తెలంగాణా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరుగ్యారంటీలకు దరఖాస్తులు చేసుకునేందుకు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన కేంద్రాన్ని ఎంపీడీఓ అన్నపూర్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ రోజు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో వాల్మీకి కిషోర్, సూపరింటెండెంట్ అచ్చవల్లి తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయ చైర్మన్‌గా శ్రీనివాసరావు



నియామక పత్రం అందజేత..

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ శ్రీ కోదండ రామాలయం మరియు శ్రీ గజగిరి లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం దేవాలయ ఆవరణలో నిర్వహించారు. ఆలయ చైర్మన్‌గా నారగాని శ్రీనివాసరావుతో పాటు పాలకవర్గ సభ్యులుగా వెచ్చా మంగపతిరావు, మాగం వెంకటేశ్వర్లు, యల్లంపల్లి అప్పారావు, కంభం సునిత, గురిజాల జయకుమార్, బూర వీరబాబు, ఫణిహారం వెంకటరమణాచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు. దేవాలయ అభివృద్ధికి నూతన పాలకవర్గ సభ్యులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ సులోచన, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్. సమత, ఈఓ చుండూరు రామకోటేశ్వరరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ..



కమిటీని ఎన్నుకుంటున్న గ్రామస్తులు

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీపెద్దమ్మతల్లి ఆలయ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తురక నారాయణ, ఉపాధ్యక్షుడిగా తురక రాంబాబు, కార్యదర్శిగా గొడుగు శ్రీనివాసరావు, కోశాధికారిగా పేర్ని వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా తురక కోటేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తురక రవి, బోల్ల కొమరయ్య, కేతమళ్ల శ్రీను, సూరపురెడ్డి సీతారామరెడ్డి, మైప నరసింహా, తాళ్లూరి చంద్రయ్య, సంగు నాగయ్య, పోతు వెంకటనరసయ్య, మణికొండ శ్రీను, గడ్డం కోటి, చిరునోముల రామారావు, సురేష్ బూబ్, బాణోతు రాములు, రాంబాబు, శ్రీను, ప్రభాకర్, వీరభద్రం, ఆదెర్ల అంజయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

కొణిజర్ల: మండలంలోని గోపవరంలో ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ సిఫారసుతో మంజూరైన ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.3 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు ఎంపీపీ గోసు మధు, టీపీసీసీ సభ్యుడు దర్శి చెన్నయ్య ప్రారంభించారు. నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు, అబ్బూరి హరి, తుల్లూరి నవీన్‌కుమార్, ఖాదర్‌బాబా పాల్గొన్నారు.

వందశాతం నమోదుకు సహకరించాలి



చింతకాని: పల్స్ పోలియో కార్యక్రమంపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

చింతకాని: ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించి వంద శాతం పోలియో నమోదుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ తెలిపారు. పోలియో కార్యక్రమంలో భాగంగా మండలంలో రెండో రోజు సోమవారం ఇంటింటి సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలో 8,423 గృహాలను సందర్శించి 117 మంది పిల్లలకు పోలియో చుక్కలను వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణారావు, రేచల్ రాణి, పండరీ బాయి, సిబ్బంది, పాల్గొన్నారు.

వలస కూలీల పిల్లలకు..



తల్లాడ: వలస కూలీల పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

తల్లాడ: మండలంలో సోమవారం వలస కూలీల పిల్లలకు వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు. మండలంలోని రెడ్డిగూడెం, పినపాక, మిట్టపల్లి, నూతనకల్, తల్లాడ వంటి ప్రాంతాలలో వలస కూలీలకు పోలియో చుక్కలు వేశారు. ఇటుక బట్టీల్లో పని చేసే వారి పిల్లకు కూడా పోలియో చుక్కలు వేశారు. 1,063 గృహాలను సందర్శించి 173 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



వైరా: విద్యార్థులను అభినందిస్తున్న లిటిల్ ఫ్లవర్స్ పాఠశాల యాజమాన్యం

వైరా: హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్‌లో వైరా శాంతినగర్‌లో న్యూ లిటిల్‌ఫ్లవర్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్స్ సాధించినట్లు కళాశాల చైర్మన్ పోతినేని భూమేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వివరాలు తెలిపారు. అండర్ –12 విభాగంలో పాఠశాలకు చెందిన శ్రీమన్నారాయణ, భానుప్రసాద్‌లు బంగారు పతకాలు సాధించగా, అండర్ –14 విభాగంలో గణేష్, మహాపూజ్‌లు బంగారు పతకాలను సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను చైర్మన్ భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యు, ఏఓ నరసింహారావు, కరాటే మాస్టర్ మహబూబ్‌లు అభినందించారు.

కరాటే డూ అసోసియేషన్ విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిటౌన్: హైద్రాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో జిల్లా బాలికల కరాటే డూ అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ చూపారు. 13 మంది విద్యార్థులు పాల్గొనగా ఒక గోల్డ్‌మెడల్, 9 సిల్వర్ మెడల్స్ పాటు 4 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీరిని జిల్లా కార్యదర్శి వి.పిచ్చయ్య, పట్టణ ప్రముఖులు అభినందించారు.

బాలభారతి విద్యార్థులకు పతకాలు..

తల్లాడ: స్థానిక బాలభారతి విద్యార్థులు హైదరాబాద్‌లో టీఎస్‌ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్‌లో జరిగిన సౌత్ ఇండియన్ కరాటే చాంపియన్ షిప్ 2024 పోటీల్లో ప్రతిభ కనబర్చారు. కటాస్ యు–14 విభాగంలో కె.వేదార్యన్ శ్రీరంగా, కె.సిద్ధార్థ, సీహెచ్.ఉదయ్ చరిత, జి.సాయివిష్ణుష్ బంగారు పతకాలు సాధించారు. కుమతి యూ–14లో విభాగంలో ఎం.మను, డి.ధనుష్, కె.హితేష్ శ్రీరంగా, ఎస్.అక్షిత, కె.సిద్ధార్థ బ్రాంజ్ మెడల్ సాధించారు. అదేవిధంగా కాటాస్ యు–14 విభాగంలో ఐదుగురు వెండి, నలుగురు బ్రాంజ్ మెడల్ సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, డైరెక్టర్ కోటగిరి శ్రావణి, కేఎస్ఎం ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు, కరాటే కోచ్ బాబు సిబ్బంది అభినందించారు.

తల్లాడలోని యూనివర్సల్ విద్యాలయం పూర్వ విద్యార్థి కె.రాకేష్ కరాటే చాంపియన్ షిప్‌లో ప్రథమ స్థానం సాధించడంతో యూనివర్సల్ యాజమాన్యం సన్మానించింది. విద్యాలయం కరస్పాండెంట్ టీ.కె.ప్రసన్నన్, డైరెక్టర్ మేరీ సోఫియా, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ యాకోబు పాల్గొన్నారు.



తల్లాడ: పతకాలతో బాలభారతి విద్యార్థులు



సత్తుపల్లిటౌన్: ప్రతిభ చూపిన విద్యార్థులు